## క్లుప్తంగా

### నేడు విద్యుత్ అంతరాయం

మైదుకూరు : మండలంలోని వనిపెంట సెక్షన్ ఆదిరెడ్డిపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని ఆదిరెడ్డిపల్లె ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో జేఈ నాగేంద్ర తెలిపారు. అదే విధంగా లెక్కలవారిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని ఏకర్ల పాలెం ఫీడర్‌లో ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జేఈ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**మైదుకూరులో..**

మైదుకూరు సబ్‌స్టేషన్ పరిధిలో కడప రోడ్డు ఫీడర్, తెలుగు గంగ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలోని ఎక్స్‌ప్రెస్ ఫీడర్, నంద్యాలంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని నంద్యాలం పేట ఫీడర్, కూడలి సబ్‌స్టేషన్ పరిధిలోని విపురాపురం ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామభద్రయ్య తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు.

### ఉపాధ్యాయుడి దాతృత్వం


జనార్దన్‌మురుగన్ తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటసుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పట్టెం వెంకటసుబ్బారెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని త్యాగరాజకాలనీకి చెందిన పీరయ్య, కొండమ్మల కుమారుడు జనార్దన్‌మురుగన్ గత కొంత కాలంగా వింతవ్యాధితో బాధపడుతున్నాడు. అయితే తల్లిదండ్రుల పేదరికం, ప్రభుత్వ సహకారం లేకపోవడంతో గత కొన్ని నెలలుగా ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి ఆ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేస్తూ ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బాలుడి తల్లికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో ఇప్పటి వరకు బాలుడి కుటుంబానికి రూ.60 వేలు ఆర్థిక సాయంగా అందించారు. తమ కుమారుని వైద్య ఖర్చుల నిమిత్తం అడగకుండానే ఆర్థిక సాయం చేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డిని తల్లిదండ్రులతో పాటు కాలనీవాసులు అభినందించారు.

### ప్రతిఒక్కరు మొక్కలు నాటాలి


భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డిలను సన్మానిస్తున్న ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

పోరుమామిళ్ల : ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని రక్షించాలని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాలకొలను నారాయణరెడ్డి, గౌరవ సలహాదారు గురుమూర్తి తెలిపారు. శుక్రవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ఒక ఉద్యమంగా చేపట్టి హరిత సైన్యంగా ఏర్పడి బండినరువకు ఇరువైపులా సుమారు వెయ్యి మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యతను చూసుకుంటున్న హరిత సైన్యం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి కె.వెంకటరామిరెడ్డిలను ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### గుండె జబ్బు మహిళకు అత్యాధునిక చికిత్స


చికిత్స గురించి వివరిస్తున్న కార్డియాలజిస్టు డాక్టర్ రాజశేఖర్‌వర్మ

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని గాంధీరోడ్డులో ఉన్న శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక పేస్ మేకర్ పరికరంతో గుండె జబ్బును నయం చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన ఎస్ ఖాజాబీ అనే 54 ఏళ్ల మహిళకు గుండె జబ్బుకు నిర్వహించిన చికిత్స విజయవంతం కావడంతో హాస్పిటల్ యాజమాన్యం మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో హాస్పిటల్‌లోని ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ రాజశేఖర్‌వర్మ చికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఖాజాబీ అనే మహిళ గుండె వేగం తగ్గడంతో పాటు కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ప్రొద్దుటూరులోని శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ఇక్కడి కార్డియాలజిస్టు డాక్టర్ రాజశేఖర్‌వర్మ ఆమెకు తక్షణమే పరీక్షలు నిర్వహించి గుండె వేగం, బీపీ తక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే చికిత్స ప్రారంభించి తాత్కాలిక పేస్ మేకర్ అనే పరికరాన్ని అమర్చి రెండు రోజుల పాటు పరీక్షించారు. ఈ పరికరంతో గుండె వేగం, బీపీ సరైన పద్ధతిలోకి రాలేదు. దీంతో పర్మినెంట్ పేస్ మేకర్‌ను అమర్చారు. ఈ పరికరంతో ఆమె గుండె వేగం, బీపీ సాధారణ స్థితిలోకి వచ్చాయి. పేస్ మేకర్ సుమారు 10 ఏళ్ల పాటు పని చేస్తుందని వైద్యులు తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా ఇలాంటి శస్త్ర చికిత్సలు ప్రొద్దుటూరులో నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని చికిత్స పొందిన ఖాజాబీ కుటుంబ సభ్యులు తెలిపారు.

# గురువుల స్థానం చాలా గొప్పది


ప్రొద్దుటూరు : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి


ప్రొద్దుటూరు : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు


ప్రొద్దుటూరు : సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు


మైదుకూరు : రాధాకృష్ణన్‌కు నివాళి అర్పిస్తున్న పెన్షనర్లు

ప్రొద్దుటూరు : మట్టి ముద్దకు కళాత్మక రూపాన్ని ఇచ్చి సమాజంలో గౌరవ మర్యాదలు వచ్చేలా తీర్చిదిద్దేవారే గురువులని, వారి రుణం వెలకట్టలేనిదని సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో శుక్రవారం సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులు మనకు జ్ఞానాన్ని అందించి అజ్ఞానాన్ని తొలగిస్తారన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీ మెంబర్ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు పునర్జన్మనిస్తారని తెలిపారు. రాయలసీమ వ్యాయామ శిక్షణ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బాలేపల్లి రవిశంకర్ మాట్లాడుతూ గురువులకు తరగని సంపద శిష్యులేనన్నారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులకు, ప్రైవేటు విభాగంలో సుదీర్ఘకాలం పనిచేసిన ఉపాధ్యాయులకు మొత్తం 20 మంది ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విజయమోహన్‌రెడ్డి, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, ఉపాధ్యక్షుడు సాయికుమార్, కోశాధికారి గంగాధర్, జిల్లా అధ్యక్షుడు బత్తల వెంకట ప్రసాద్, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, రామిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేటలోని శ్రీసరస్వతి విద్యామందిరంలో ఉన్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య గురుపూజోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపన్యాసకులు ఎం.మల్లికార్జునరావు, మూలె రామమునిరెడ్డి, బి.సుశీలమ్మ, పీపీ రంగారెడ్డి, వై.లక్ష్మీదేవి, రామలింగారెడ్డి, సదాశివారెడ్డిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కె.ఓబుళరెడ్డి, చైర్మన్ కళావతి, డైరెక్టర్లు, ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకుని విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు, సుబ్బారెడ్డి, జాన్ సురేష్, వెంకటేశ్వర్లు, రామసుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి**

బద్వేలు అర్బన్ : సమాజంలో గౌరవప్రదమైన, పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల ఏఓ రాచపూడివెంకటసాయిక్రిష్ణ తెలిపారు. శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. అనంతరం కళాశాలకు చెందిన అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సంఘం గౌరవ సలహాదారుడు జి.పుల్లంరాజు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కె.బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు గంజికుంట పుల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిచ్చయ్య, రిటైర్డ్ డీఎస్పీ వెంకటయ్య, రిటైర్డ్ ఎంఈఓ రామసుబ్బయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆనందరావు, ప్రసాద్, శ్రీరాములు, చెన్నరాయుడు, శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు సన్మానం**

పోరుమామిళ్ల : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కృష్ణశారద డిగ్రీ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ పోతిరెడ్డి నాగార్జున రెడ్డి, చైర్మన్ దేశాయిమార్కారెడ్డి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పాలకొలను రామచంద్రారెడ్డి, రమణారెడ్డిలను ఘనంగా సన్మానించారు. పాలకొలను రమణారెడ్డి నావికాదళంలో కోస్టుగార్డెన్‌గా పనిచేస్తూ తన ప్రాణాలను తెగించి 7 మంది భారత జాలర్లను పాకిస్థాన్ చెర నుండి విముక్తి చేసినందుకు రాష్ట్రపతి అవార్డు పొందారని తెలిపారు.

**ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**

కలసపాడు : మండలంలోని కలసపాడు ప్రాథమిక పాఠశాల, కరణంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. గురువులను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రమణారెడ్డి, బి.భాస్కర్‌రెడ్డి, శేఖర్‌బాబు, జి.రమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

**సర్వేపల్లికి పెన్షనర్ల నివాళి**

మైదుకూరు : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మైదుకూరులో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి పెన్షనర్లు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా, గురువులకే గురువుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరొందారని కొనియాడారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు ఏవీ సుబ్బన్న, జి.దేవదానంలను పెన్షనర్లు సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సి.సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి ఏవీ రమణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు సూరే కృష్ణయ్య, ఖాజా హుస్సేన్, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థి జీవిత పురోగతిలో ఉపాధ్యాయులే పాత్ర మరువలేనిది**

ఖాజీపేట : విద్యార్థుల జీవితాలను ఉన్నత స్థాయికి చేరుకునేలా చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది అని బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్ చైర్‌పర్సన్ సరస్వతమ్మ అన్నారు. బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు అందరూ కలసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి చైర్‌పర్సన్ చేతులమీదుగా ఉపాధ్యాయులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవితకు పునాదులు వేసేది ఉపాధ్యాయులే అన్నారు. ఒక చిన్న ఉపాధ్యాయుని స్థానం నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విజయాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందంతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.


బద్వేలు : రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


పోరుమామిళ్ల : ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాగార్జునరెడ్డి


కలసపాడు ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఖాజీపేట: ఆటల పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

# బస్తా యూరియా రూ.450

గోపవరం : యూరియా కొరతను దృష్టిలో ఉంచుకుని కొందరు డీలర్లు రూ.275లకు విక్రయించాల్సిన బస్తా యూరియాను రూ.450లకు విక్రయిస్తూ యథేచ్ఛగా బరితెగిస్తున్నారు. అది కూడా కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని మెలిక పెడుతున్నారు. అంతేకాకుండా కాంప్లెక్స్ ఎరువులు కూడా ఎమ్మార్పీ ధరలకు ఇస్తున్నారంటే అదీ లేదు. ప్రతి బస్తాపైన రూ.100 నుండి రూ.150లు అదనంగా అమ్ముతున్నారు. ఇదేమిటని రైతులు డీలర్‌ను ప్రశ్నిస్తే అవసరమైతే తీసుకో లేదంటే వెళ్ళిపో అని దబాయిస్తున్నారు. గోపవరం, బద్వేలు పరిధిలో ఉన్న ఎరువుల దుకాణాల్లో నిత్యం ఇదేతంతు కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు బాధిత రైతులు ఫిర్యాదు చేసినా వారి నుండి ఎలాంటి సమాధానం ఉండటం లేదు. ఎరువుల దుకాణాల్లో అధికారులు నిర్వహిస్తున్న తనిఖీలు మొక్కుబడిగానే ఉన్నాయి. నెలలో రెండు, మూడుసార్లు ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తున్నా ఏ డీలర్‌పైనా కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు యూరియా అవసరముంది. ఆ యూరియా కూడా బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడింది. ప్రతి దుకాణంలో యూరియా ఉన్నప్పటికీ అడిగిన రైతులకు లేదని చెబుతూ కృత్రిమ కొరత సృష్టిస్తుండటమే కాక అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. బస్తా యూరియా కొనాలంటే పాస్పేట్ బస్తా రూ.1700 పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడుతుంది. కొందరు రైతులు విధిలేని పరిస్థితుల్లో అవసరం లేకపోయినా యూరియా కోసం కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ళ పాలనలో ఎప్పుడు కూడా ఎరువుల కొరత వచ్చిన దాఖలాలు లేవని రైతులు బాహాటంగానే చెబుతున్నారు. అంతేకాకుండా నేరుగా రైతుభరోసా కేంద్రాలకే సీజన్‌ను బట్టి ఎరువులు స్టాకు ఉండేవి. అవసరమైన ఎరువులను ఆ గ్రామంలోనే తెచ్చుకునేవారమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్పుడూ లేని విధంగా యూరియా కొరత ఏర్పడిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా రైతులు బోర్ల కింద వరినాట్లు వేసేందుకు సిద్ధపడుతున్నారు. కొన్నిచోట్ల నాట్లు కూడా వేయడం జరిగింది. దీంతో యూరియా రైతులకు అవసరముంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అధిక రేటుకు యూరియా విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంప్లెక్స్ ఎరువులతో పాటు యూరియాను డీలర్లు అధిక రేట్లకు అమ్ముతున్న విషయంపై మండల వ్యవసాయాధికారి విజయరావును సాక్షి వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని, అయితే రైతులు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలని డీలర్లకు చెబుతున్నామని, రైతులు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండి కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు బిల్లులు తీసుకోవాలని సూచించారు.

## యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న విజిలెన్స్ సీఐ శివన్న

గోపవరం : యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై కఠినచర్యలు తీసుకోనున్నట్లు విజిలెన్స్ టీం సీఐ ఎం.శివన్న హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పి.వి.మోహన్‌రాజ, సాయికృష్ణ ట్రేడర్స్ దుకాణాల్లో స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. యూరియా డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కృత్రిమ కొరత సృష్టించినా అధిక రేట్లకు విక్రయించినా ఉపేక్షించేది లేదన్నారు. యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు కూడా ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ అమ్ముతున్నట్లు రైతుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వారిపై కేసులు కూడా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులు కూడా తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, అప్పుడే బస్తాపైన ఉన్న రేటు, డీలర్ అమ్మే రేట్లు వ్యత్యాసం తెలిసిపోతుందన్నారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయాధికారి విజయరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికలు వస్తున్నాయని భూమి పూజ చేశారా


మాట్లాడుతున్న కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : వచ్చే జనవరిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన కారణంగానే మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు తొలి మారు టెంకాయ కొట్టి పూజ చేశారని కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి టీడీపీ పట్టణాధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి విమర్శలు చేయడం సరికాదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఏ కార్యక్రమం జరిగినా అందరికి ఆహ్వానం ఉండేదని, పండుగలా కార్యక్రమాన్ని జరిపేవారమన్నారు. 33వ వార్డులో నంద్యాల కొండారెడ్డి చేసిన భూమి పూజకు కూడా మీ నాయకులంతా హాజరయ్యారు కదా అని అన్నారు. 16 మంది టీడీపీ కౌన్సిలర్లు ఉన్నా కూటమి ప్రభుత్వంలో మున్సిపాలిటీకి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని కోరారు. చేసిన అభివృద్ధికి సంబంధించి ఏదైనా ల్యాండ్ మార్క్ ఉందా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో జరిగిన 1153 అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి విజిలెన్స్ విచారణ చేయించారని తెలిపారు. 16 మంది కాంట్రాక్టర్లకు సంబంధించిన రూ.8కోట్ల బిల్లులు రాకుండా ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారన్నారు. విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చినా రెండో మారు మళ్లీ ఎమ్మెల్యే మంత్రి నారాయణకు లేఖ ఇచ్చి విచారణ చేయాలని కోరారన్నారు. కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి మాట్లాడుతూ ఐదో వార్డు కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి డీఏడబ్ల్యూ కళాశాలలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లపై పిటీషన్లు పెట్టి రూ.25లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. సమావేశంలో కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎగ్జిబిషన్ వేలం పాట జాప్యానికి కారకులు ఎవరు..?

- కొండారెడ్డి ఆదేశాలతో కమిషనర్ కౌన్సిల్ సమావేశాన్ని జరపలేదు
- మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : సుమారు రూ.2కోట్ల ఆదాయానికి సంబంధించిన ఎగ్జిబిషన్ వేలం పాట జాప్యానికి కారకులు ఎవరని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనయుడు కొండారెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తున్నారని, కొండారెడ్డి ఆదేశాలతోనే కమిషనర్ ఇప్పటి వరకు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించలేదన్నారు. శుక్రవారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 30 ఏళ్లలో ఎన్నడూ ఎగ్జిబిషన్ వేలంపాట నిర్వహణ జాప్యం జరగలేదన్నారు. కేవలం టీడీపీ నేతల నిర్వాకం వల్లే మున్సిపాలిటీకి నష్టం వాటిల్లే పరిస్థితి వచ్చిందన్నారు. గత నెల 14న కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి కమిషనర్‌కు లేఖ రాసినా, వాట్సాప్‌లో మెసేజ్ చేసినా స్పందన లేదన్నారు. కనీసం అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలని గత నెల 28న కమిషనర్‌ను కోరినా 30వ తేదీ డీడీ ఆర్సీ సమావేశం ఉన్న కారణంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి లేరని సమావేశం జరపలేదన్నారు. నిబంధనల ప్రకారం మున్సిపల్ చైర్‌పర్సన్ అనుమతి లేనిదే కమిషనర్ బయటి ప్రాంతాలకు సమాచారం లేకుండా పోకూడదన్నారు. గతంలో ప్రతినెల కౌన్సిల్ సమావేశాలు నిర్వహించే పరిస్థితి ఉండేదన్నారు. సమావేశానికి సంబంధించిన ప్రియాంబుల్స్ శుక్రవారం చైర్‌పర్సన్‌కు అందాయని, ఈనెల 9న కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు. ఈనెల 22 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయని, ఇప్పటికీ ఎగ్జిబిషన్ వేలం పాట జరగకపోతే ఎలా అని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత గెజిట్ పబ్లికేషన్ చేయాల్సి ఉందని, సంబంధిత కాంట్రాక్టర్ వేలం పాట డబ్బు చెల్లించిన తర్వాత ఎగ్జిబిషన్ సామాగ్రిని ఏర్పాటు చేసుకోవడానికి 15 రోజుల సమయం పడుతుందన్నారు. ఈ కారణంగా ఈ ఏడాది మున్సిపాలిటీకి ఏ మేరకు ఆదాయం లభిస్తుందో వేచి చూడాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మిలాద్–ఉన్ నబీ వేడుకలు


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు


ఖాజీపేటలో ర్యాలీగా వెళుతున్న ముస్లింలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని ముస్లిం సోదరులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ పండుగ సందర్భంగా అంజుమన్ అహలె ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మైదుకూరు రోడ్డులోని నజీరుల్లా షా మఠం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మైదుకూరు రోడ్డు, శివాలయం సర్కిల్, పప్పుల బజార్, సుందరాచార్యుల వీధి మీదుగా అసారె షరీఫ్‌కు చేరింది. ఈ సందర్భంగా అంజుమన్ అహలె ఇస్లాం కమిటీ అధ్యక్షుడు వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్-ఉన్-నబీ పండుగగా జరుపుకొంటామన్నారు. ప్రవక్త బోధనలు మానవాళికి అనుసరణీయమని తెలిపారు. కార్యక్రమంలో పలు ముస్లిం సంఘాలు, పలు మసీదుల ప్రతినిధులు, అంజుమన్ కమిటీ ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**అన్నదానం**

ప్రొద్దుటూరు : పట్టణంలోని యాచకులు, నిస్సహాయకులకు, వృద్ధులకు, సాధువులకు ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ఫారుక్, వారి కుటుంబ సభ్యులు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫారుక్, కొర్రపాడు వేణు, రాజు, లాయర్ సుమంత్, సునీల్ పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో మిలాద్ – ఉన్ – నబీ**

ఖాజీపేట : ఖాజీపేట, సర్వర్‌ఖాన్‌పేటలోని ముస్లింలు కలసి మిలాదున్ నబీ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. సర్వర్‌ఖాన్‌పేటలోని మసీదు వద్ద పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. అక్కడ నుంచి ర్యాలీగా మహమ్మద్ ప్రవక్త గొప్పదనం గురించి వివరించే పాటలను పాడుకుంటూ వెళ్లారు. ఖాజీపేట బస్టాండ్ కూడలి మీదుగా ఖాజీపేటలోని మసీదు వరకు ర్యాలీ సాగింది. అనంతరం అక్కడే దేవుని మహిమలు, సమాజంలో మనం ఎలా నడుచుకోవాలన్న నడవడిక గురించి స్థానికులకు ముస్లిం పెద్దలు వివరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

## మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వద్ది సురేఖ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్‌గా టీడీపీ నాయకుడు వద్ది బాలుడు సతీమణి వద్ది సురేఖను ఎంపిక చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో శుక్రవారం వద్ది బాలుడు దంపతులతోపాటు పలువురు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## దోమకాటుకు గురికాకుండ అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : దోమకాటు బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారులు టి.నరసింహారెడ్డి, ఐ.సుబ్బరాయుడు అన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని వీరప్పల్లి, వెంకటాద్రినగర్, రామాంజనేయనగర్ ఎస్టీకాలనీలలో కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు పలు ప్రాంతాల్లో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం వలన దోమలను నివారించవచ్చని, తద్వారా కీటకజనిత వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపువ్యాధి వంటి వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ఇంటి పరిసరాలలోని డ్రమ్ముల్లో, ఎండిన కొబ్బరిబోండాల్లో, టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం లార్వా, ఫీవర్‌సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్‌లు జనార్దన్‌రావు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.